సాక్షి
కాకినాడ
బుధవారం | 4 | అక్టోబర్ | 2023



సుదర్శన హోమానికి రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి:అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో మంగళవారం నారసింహ సుదర్శన హోమానికి ఎస్.శ్రీరామరాజు, చంద్రావతి దంపతులు (పాలకొల్లు) రూ.లక్ష విరాళం అందజేశారు.



పరిశుభ్రతే లక్ష్యంగా 'స్వేచ్ఛ'

ప్రభుత్వం పాఠశాల విద్యకే కాదు..విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రాధాన్యమిస్తోంది. అంతేకాదు బాలికల ఆరోగ్య పరిరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది.

8 లో

2.02 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 2,02,048 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచి పెట్టారు. అలాగే తూర్పు డెల్టాకు 4,400, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. భద్రాచలం వద్ద 23.10, కాటన్ బ్యారేజీ వద్ద 10.50 అడుగులకు నీటి మట్టం చేరింది.

న్యూస్‌రీల్

5న టేబుల్ టెన్నీస్ క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా టేబుల్ టెన్నీస్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 5న జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి మోహన్‌బాబు మంగళవారం తెలిపారు. పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో ఎంపికలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. బాలురు, బాలికలు, పురుషులు, మహిళల విభాగంలో ఎంపికలు జిల్లా జట్లు ఎంపిక జరుతుందని పేర్కొన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 13 నుంచి 16 వరకు అనంతపురంలో జరిగే అంతర్‌జిల్లాల టేబుల్‌టెన్నీస్ పోటీల్లో జిల్లా తరుపున పాల్గొంటారని సంఘ అధ్యక్షుడు సిహెచ్ విజయప్రకాష్ తెలిపారు. ఈఎంపికలకు ఆసక్తి గలవారు 8978014488 నెంబరులో సంప్రదించాలని కోరారు.

డయల్ యువర్ కలెక్టర్‌కు సమస్యల నివేదన

కాకినాడ సిటీ: జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు మంగళవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి 10 మంది సంక్షేమ పథకాల లబ్ధి, విద్య, ఉపాధి, భూ సర్వే, భూ సమస్యలు, పారిశుధ్యం వంటి సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్ 18004253077కు ఫోన్ చేశారు. తమ సమస్యలను నివేదించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ఫోన్ ద్వారా తెలియజేసిన సమస్యలను గడువులోగా పరిష్కరించాలన్నారు. డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి, ఏవో శ్రీనివాసరావు, వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని తీరుపై నిరసన



ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు, విద్యార్థినుల తల్లిదండ్రులు

పెరవలి: పెరవలి మండలం కానూరు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుని తీరుపై విద్యార్థినుల తల్లిదండ్రులు, బీఎస్పీ నాయకులు మంగళవారం ధర్నా చేశారు. ఈ పాఠశాలలో రసాయనిక శాస్త్రం భోదించే సిహెచ్ గంగరాజు 9, 10,ఇంటర్ చదువుతున్న విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిన్నారనే ఆరోపణలున్నాయి. గతనెలలో ప్రధానోపాధ్యాయురాలు రంగనాయకమ్మకు, ఎంఈఓ స్వరూప్‌కు ఈమేరకు ఫిర్యాదు చేసినట్లు బీఎస్పీ నాయకుడు వెన్నపు సుధాకర్ తెలిపారు. అయినా చర్యలు తీసుకోకపోవటంతో ధర్నా చేయాల్సి వచ్చిందన్నారు. ధర్నా సమాచారం తెలుసుకుని పెరవలి ఎస్ఐ సూర్య భగవాన్ సిబ్బందితో వచ్చి పరిస్థితి అదుపు చేశారు. తల్లిదండ్రులు, బీఎస్పీ నాయకులు, ఉపాధ్యాయులతో ఆరోపణలపై నిజనిర్ధారణ కమిటీ వేశారు. విద్యార్థినులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో నిజనిర్ధారణ కమిటీ ఆరోపణలను ధ్రువీకరించింది. ఉన్నతాధికారులకు నివేదించిం వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఎంఈఓ స్వరూప్ హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.

బుద్ధా వెంకన్నపై చర్యలు తీసుకోవాలి



మూడో పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నాయకుడు బుద్ధా వెంకన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ డిమాండ్ చేసింది. సెల్ జిల్లా కార్యదర్శి పీవీవీఎస్‌బీ రాజు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జిల్లా కోర్టు నుంచి న్యాయవాదులు ర్యాలీగా త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. బుద్ధా వెంకన్నపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పీవీవీఎస్‌బీ రాజు, లీగల్ సెల్ రీజినల్ కోఆర్డినేటర్ సాదిక్ హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు దూడల వీవీ త్రినాథ్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రిమాండ్ పిటిషన్ విషయంలో నిర్ణయం తీసుకున్న న్యాయమూర్తిపై బుద్ధా వెంకన్న అనుచితమైన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అలాగే మంత్రి రోజా పైనా ఆయన అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్నారు. కోర్టులో విచారణలో ఉన్న కేసుపై వ్యాఖ్యలు చేయడం కోర్టు ధిక్కారణ నేరంగా పరిగణించబడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ వి.సురేష్, కాశి శ్రీనివాస్, బీర అరుణ కుమార్, సీహెచ్ రాజు, ఎస్.ప్రవీణ్‌కుమార్, సీహెచ్‌వీ రామారావు చౌదరి, మామిడిపల్లి ఫణీంద్ర, పీబీజీ ఆనందబాబు, పిల్లి రమ్య నాగిని, మల్లిమొగ్గల చిన్నబాబు పాల్గొన్నారు.

తూర్పున పారిశ్రామిక నవోదయం



రవళి స్పిన్నింగ్ మిల్‌లో నూలు ఉత్పత్తి

- ఖండవల్లి స్పిన్నింగ్ మిల్ సామర్థ్యం పెంపు
- కనుపూరులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్
- వర్చువల్ ద్వారా ప్రారంభించనున్న సీఎం జగన్
- సర్వం సిద్ధం చేసిన అధికార యంత్రాంగం
- ఇప్పటికే గుమ్మళ్లదొడ్డిలో ఇథనాల్ పరిశ్రమ
- గ్రాసిం ఇండస్ట్రీ సామర్థం పెంపునకు అడుగులు

సాక్షి, రాజమహేంద్రవరం: జిల్లాలో పారిశ్రామిక ప్రగతి జోరందుకుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి ఫలితంగా పరిశ్రమల స్థాపనకు స్నేహపూర్వక వాతావరణం ఏర్పడింది. సహజ వనరులు పుష్కలంగా ఉన్న జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఇప్పటికే కొనసాగుతున్న పరిశ్రమల సామర్థ్యం పెంపునకు సులువుగా అనుమతులు మంజూరు చేస్తుండటంతో మరింత మందికి ఉపాధి దక్కుతోంది. ఇందులో భాగంగానే పెరవలి మండలం ఖండవల్లిలోని 'రవళి స్పిన్నింగ్ మిల్' సామర్థ్యం పెంపునకు బుధవారం వర్చువల్ ద్వారా అనుమతులు ఇవ్వనుండగా.. కోరుకొండ మండలం కనుపూరు గ్రామంలో రూ.4.45 కోట్ల వ్యయంతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ స్థాపనకు వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేపట్టనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది.

2005లో ప్రారంభమైన స్పిన్నింగ్ మిల్:

పెరవలి మండలం ఖండవల్లి గోదావరి పరివాహక ప్రాంతం. ఈ ప్రాంతంలో ఎలాంటి పరిశ్రమలు లేవు. అలాంటి తరుణంలో పలువురికి ఉపాధి కల్పించాలన్న సదుద్దేశంతో 2005లో ప్రముఖ పారిశ్రామిక వేత్త వంక రవీంద్రనాథ్ 'రవళి స్పిన్నర్లు' అనే కాటన్ స్పిన్నింగ్ మిల్స్‌ను స్థాపంచారు. తొలుత 16,800 స్పిండిల్స్ ఉత్పత్తి కెపాసిటీతో పరిశ్రమకు నాంది పలికారు. అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీసుకొచ్చిన ఇండస్ట్రియల్ పాలసీతో సులువుగా అనుమతులు మంజూరు చేయడం, పరిశ్రమ స్థాపనకు ప్రోత్సాహం అందించారు. అప్పటి నుంచి అంచెలంచెలుగా అభివృద్ధి చెందిన సంస్థ 1,0, 1520 స్పిన్డిల్స్‌గా, 2,900 డ్రమ్స్‌గా విస్తరించింది. సంస్థలో ప్రస్తుతం వెయ్యి మందికి పైగా కార్మికులు ఉపాధి పొందుతున్నారు. అత్యధిక శాతం మహిళలు ఉపాధి పొందుతున్నారు. నెలకు 10 వేల టన్నుల నూలు ఉత్పత్తి అవుతోంది. సాధారణ నూలే కాకుండా జీన్స్‌కు ఉపయోగపడే నూలు, అన్ని రకాల వస్త్రాలకు ఉపయోగపడే నూలు తయారు చేస్తున్నారు. ఇక్కడ ఉత్పత్తి అవుతున్న నూలు ఫిలిపిన్స్, జపాన్, సౌత్‌కొరియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, మలేషియా, పోర్చుగల్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. తాజాగా రెండు లక్షల స్పిన్డిల్స్ తయారీ సామర్థ్యానికి చేరుకోనుంది. తద్వారా మరో 1000 మందికి ఉపాధి లభించనుంది. ఈ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ అమరావతి నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు.

రూ.260 కోట్లతో ఇథనాల్ పరిశ్రమ

గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామంలో 20.07 ఎకరాల్లో ఇథనాల్ ప్లాంట్‌కు నాంది పలికారు. రూ.260 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న ప్లాంట్‌లో 210 మందికి ఉపాధి దక్కనుంది. ఇక్కటి ప్లాంట్ ద్వారా రోజుకు 200 కిలో లీటర్ల (2 లక్షల లీటర్ల) ఇథనాల్ ఉత్పత్తి కానుంది. ప్లాంట్ నిర్మాణ పనులకు సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేశారు. పనులు సైతం జరుగుతున్నాయి.

గ్రాసిమ్ ఇండస్ట్రీతో..

బిక్కవోలు మండలం బలభద్రపురంలో ఆదిత్య బిర్లా గ్రూపు నిర్మించిన గ్రాసిమ్ కాస్టిక్ సోడా ప్లాంట్ ప్రారంభించారు. చంద్రబాబు ప్రభుత్వంలో అటకెక్కిన పరిశ్రమకు జీవం పోశారు. తొలి దశలో రూ.1,000, రెండో దశలో రూ.1,500 కోట్ల పెట్టుబడితో స్థాపించిన పరిశ్రమ 2500 మందికి ఉపాధి కల్పించనుంది. ఇప్పటికే తొలి దశలో పెట్టుబడులతో ప్రారంభమైన పరిశ్రమ.. ఉత్పత్తిని మరింతగా విస్తరించేందుకు ప్రభుత్వానికి అనుమతులు కోరింది. దీనిపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రామసభ సైతం నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు.

రూ.4.45 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

కోరుకొండ మండలం కనుపూరు గ్రామంలో రూ.4.45 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు వర్చువల్ ద్వారా సీఎం బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలో సెకండరీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల అభివృద్ధి చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 2020–25ని రూపొందించింది. అందులో భాగంగా ఆర్బీకే, మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించిన పంటల మిగులు ఉత్పత్తులను ప్రాసెస్ చేసేందుకు రాష్ట్రంలో 26 నంబర్ల సెకండరీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను (ప్రతి పార్లమెంట్ నియోజక వర్గంలో ఒక యూనిట్) ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగా సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌కు అడుగులు పడ్డాయి. సిడ్బి ఆర్థిక సాయంతో యూనిట్ ఏర్పాటు కానుంది.

అంతర్జాతీయ అవసరాలకు అనుగుణంగా..



వ్యర్థాల దూదితో తిరిగి మంచి నూలును తయారు చేసేవిధంగా తీర్చిదిద్దుతున్నాం. నూతన విస్తరణ దీని ఆధారంగానే ఉంటుంది. అంతర్జాయతీయ అవసరాల కోసం భిన్నమైన కౌంట్స్ తయారు చేసి ఎగుమతులు పెంచాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నాం.

– వంక రాజకుమారి, జాయింట్ డైరెక్టర్

మహిళలే ప్రత్యేకత



మా సంస్థలో మహిళలదే అగ్రస్థానం. వారికి ఉపాధి కల్పించాలన్నదే ప్రధాన ఉద్దేశం. మహిళలే ప్రధాన యాజమాన్యం. తద్వారా అద్భుతాలు సృష్టించగలుగుతున్నాం. ప్రస్తుతం మరింత మంది అతివలకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో మిల్లు విస్తరణకు అడుగులు వేస్తున్నాం.

– సింహాద్రి రవళి, డైరెక్టర్, వైస్ చైర్మన్, రవళి స్పిన్నింగ్ మిల్



ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కె.మాధవీలత



రవళి స్పిన్నింగ్ మిల్‌లో నూలు ఉత్పత్తి

దేశానికి ఆదర్శం జగనన్న ఆరోగ్య సురక్ష

రాష్ట్ర రోడ్లు,భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా



ఏ.కొత్తపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తొండంగి: పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. అందులో భాగంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమన్నారు. తొండంగి మండలం ఏ.కొత్తపల్లి గ్రామ సచివాలయం –1లో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంత్రి పరిశీలించారు. వైద్యులు, వైద్య సిబ్బంది అందిస్తున్న సేవల గురించి వృద్దులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థికాభ్యున్నతికి దోహదపడుతున్నాయన్నారు. భావి తరాలకు ఉపయోగపడేలా విద్యా వ్యవస్థలో పలు సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. విద్యతోపాటు ఆరోగ్య రంగానికి కూడా అదే తరహాలో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. దివంగత వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం పొందేలా ప్రవేశపెడితే సీఎం జగన్ దాని కొనసాగింపుగా ఇప్పుడు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కూడా చేపట్టారన్నారు. ఈ కార్యక్రమం కింద వైద్యులు ఇంటికే వచ్చి సేవలందిస్తున్నారన్నారు. . ఇప్పటికే పీహెచ్‌సీలకు కొత్త భవనాలు నిర్మించారన్నారు. గ్రామాల్లో విలేజ్ క్లీనిక్‌లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. గ్రామస్థాయిలోనే కార్పొరేట్ వైద్యానికి దీటుగా ప్రభుత్వం సేవలందిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం పొందాలంటే పట్టణ ప్రాంత కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఈ పథకం ద్వారా ప్రజలు తమ గ్రామాల్లోనే వ్యాధులను నయం చేసుకుంటున్నారన్నారు. ఉచితంగా మందులు కూడా అందించే సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు మరింత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబు, వైఎస్సార్ సీపీ మండల సమన్వయకమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, సర్పంచ్ బెక్కం రాజా వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

కొబ్బరి ఉప ఉత్పత్తుల పరిశ్రమలకు ప్రోత్సాహం



అంబాజీపేటలో మాట్లాడుతున్న జనరల్ మేనేజర్ ప్రసాద్

అంబాజీపేట: కొబ్బరి ఉప ఉత్పత్తుల తయారీ, విలువ ఆధారిత పరిశ్రమలకు జిల్లా పరిశ్రమల శాఖ ఆర్థిక సహకారం అందిస్తుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పి.కె.పి.ప్రసాద్ తెలిపారు. అంబాజీపేటలో కృషీవల కోకోనట్ ఫార్మర్స్, ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ కార్యాలయంలో చైర్మన్ గణపతి వీర రాఘవులు అధ్యక్షతన జిల్లాలోని ఎఫ్‌పీఓలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కోనసీమ ప్రాంతంలో విరివిగా పండుతున్న కొబ్బరి నుంచి ఉప ఉత్పత్తులను తయారు చేసే పరిశ్రమలు నెలకొల్పేందుకు రైతులతోపాటు యువత ముందుకు రావాలని సూచించారు. కొబ్బరి ఉప ఉత్పత్తుల తయారీ పరిశ్రమలకు రాయితో కూడిన రుణాలను పరిశ్రమల శాఖ మంజూరు చేస్తుందన్నారు. 2023–27 పాలసీ ప్రకారం కొబ్బరి తాడు పరిశ్రమ, చాకో బార్, వర్జిన్ కోకోనట్ ఆయిల్ తయారీ పరిశ్రమల స్థాయిని బట్టి 15 శాతం రాయితీతో కూడిన రూ.20 లక్షలు, 35 శాతం రాయితీతో రూ.50 లక్షల వరకు రుణాలు అందిస్తామన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అందిస్తున్న సహకారాన్ని కొబ్బరి రైతులు, యువత సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని సూచించారు. ఏడీ పి. శివరామప్రసాద్, అంబాజీపేట సొసైటీ చైర్ పర్సన్ దొమ్మేటి సత్యమోహన్, కోనసీమ ఎఫ్‌పీఓ చైర్మన్ వేగి వెంకటేశ్వరరావు, నారియల్ భారత్ చైర్మన్ నైనాల వేణుగోపాలరావు, బీకేస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాల జమ్మిలు, ఉప్పుగంటి భాస్కరరావు, అడ్డాల గోపాలకృష్ణ, కంపెనీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

గదుల ఆదాయం అదరహో..



అన్నవరం: శ్రీ సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి వసతి సత్రాల గదుల అద్దెలు, గదుల రిజర్వేషన్ల ద్వారా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు రూ.4.75 కోట్లు ఆదాయం వచ్చింది. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ మంగళవారం ఈ విషయం మీడియాకు తెలిపారు. గడచిన ఆరునెలల్లో ఆషాఢం, నిజశ్రావణం రెండు నెలలు శుభముహూర్తాలు లేకపోవడంతో దేవస్థానానికి భక్తులు ఎక్కువగా రాలేదు. అయినప్పటికీ సత్రం గదుల అద్దెల ద్వారా ఆదాయం గణనీయంగా రావడం విశేషం. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయంలో రూ.3.70 కోట్లు ఆదాయం వచ్చింది. గతేడాదితో పోల్చితే రూ.1.05కోట్లు ఆదాయం అదనంగా సమకూరింది. అక్టోబర్ నుంచి వచ్చే మార్చి 31 వరకు సత్యదేవుని సన్నిధికి భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది. అక్టోబర్ 15 నుంచి 23 తేదీ వరకు దసరా సెలవులు. తరువాత కార్తిక మాసం. ఆ తరువాత కూడా భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది. ఫలితంగా సత్రాల ద్వారా మరో రూ.ఆరు కోట్ల రాబడి వస్తుందని భావిస్తున్నారు.

ప్రతికూలతలకు ఎదురీది..

- ఈ ఏడాది వరుణుడి చిన్నచూపు
- జిల్లాలో వర్షపాతం లోటు 24 శాతం
- అయినప్పటికీ 94 శాతం మేర ఖరీఫ్ సాగు
- వరి సాగు లక్ష్యం 92,082 హెక్టార్లు
- 86,772 హెక్టార్లలో నాట్లు
- ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు



కోటనందూరు మండలం అల్లిపూడిలో ఆలస్యంగా పడుతున్న వరి నాట్లు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఈ ఏడాది ప్రకృతి సృష్టించిన ప్రతికూలతలను ఎదురీదుతూ మరీ జిల్లా రైతు లు పంటల సాగును విజయవంతంగా చేపట్టారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలను కాపాడే లక్ష్యంతో ప్రభుత్వం గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ముందస్తు సాగుకు ఏర్పాట్లు చేసింది. రైతులకు అవ గాహన కల్పించింది. ముందుగానే సాగునీరు విడు దల చేసింది. సాగునీటి సదుపాయం ఉన్న ప్రాంతాల కు పెద్దగా ఇబ్బంది లేనప్పటికీ.. వరుణుడు కరుణించకపోవడంతో మెట్ట ప్రాంత రైతులు ఈ ఖరీఫ్‌లో నీటితడి కోసం కాస్త ఇబ్బందులు పడ్డారు. ఆగస్టు నెలాఖరులోగా వరి నాట్లు వేస్తే నవంబర్ నెలలో వచ్చే తుపాన్లు, భారీ వర్షాల వంటి ప్రకృతి వైపరీత్యాల వలన పంటలకు పెద్దగా నష్టం జరగదన్నది ప్రభుత్వ ఉద్దేశం . తద్వారా రైతులను ఒడ్డున పడేయాలని, దీంతో పాటు మూడో పంట సాగు చేసేందుకు వీలుగా రైతులకు అవకాశం కల్పించాలని భావించింది. ఇదే లక్ష్యంతో ఆయా జలాశయాల నుంచి జూన్ మొదటి వారంలోనే ఆయకట్టుకు నీరు విడుదల చేసింది. అయితే జూలై, ఆగస్టు నెలల్లో వరుణుడు ముఖం చాటేశాడు. ఆకాశం మబ్బులు పట్టినా.. వానలు కురకపోవడంతో సాగులో ఎక్కడ లేని జాప్యం చోటు చేసుకుంది. జిల్లా సాధారణ వర్షపాతంలో ఈ ఏడాది ఇప్పటి వరకూ 24 శాతం లోటు నమోదైంది. వానలు లేక పలు మండలాల్లో ముఖ్యంగా మెట్ట ప్రాంత మండలాల్లో రైతులకు సకాలంలో వరి సాగు చేసే వీలు లేకుండా పోయింది. అయినప్పటికీ కూడా రైతులు లక్ష్యానికి దాదాపు చేరువగా పంటలు వేశారు. ఈ ఖరీఫ్‌లో జిల్లావ్యాప్తంగా 92,082 హెక్టార్లలో వరి సాగు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకూ 86,772 హెక్టార్లలో వరి సాగు జరిగింది. మిగిలిన ప్రాంతాల్లో వరి సాగుకు నీటి వసతి లేకపోవడంతో అపరాలతో పాటు రాగులు, కందులు, పత్తి, చెరకు సాగుపై రైతులు దృష్టి సారించారు.


ప్రత్యామ్నాయ పంటల సాగు ఇలా..

లోటు వర్షపాతం కారణంగా ఈ ఏడాది జిల్లాలోని తుని, తొండంగి, కోటనందూరు, రౌతులపూడి, శంఖవరంతో పాటు పలు మండలాల్లో వరినాట్లు బాగా ఆలస్యమయ్యాయి. దీంతో అక్కడి రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకున్నారు. ప్రత్తి 4,095, మినుము 1,125, చెరకు 3,755, మొక్కజొన్న 238, రాగులు 216, కందులు 153, పెసలు 22 హెక్టార్లలో వేశారు. పలువురు రైతులు చిరుధాన్యాలు కూడా సాగు చేస్తున్నారు.

వెదజల్లుపై ఆసక్తి

సాధారణంగా ఖరీఫ్‌లో వెదజల్లు సాగుపై రైతులు పెద్దగా ఆసక్తి చూపరు. కానీ ఈసారి జూన్, జూలై నెలల్లో వర్షాలు కురవకపోవడంతో వరి నారు పోసుకొనే అవకాశం లేకపోయింది. ఆగస్టులో వర్షం కురిసినా నారు వేసుకొనే అవకాశం లేదు. ఖరీఫ్ సీజన్ ఆలస్యమయ్యే పరిస్థితి ఏర్పడటంతో అప్రమత్తమైన వ్యవసాయ శాఖ వెదజల్లు సాగుపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించింది. దీంతో జిల్లాలోని 30,443 హెక్టార్లలో రైతులు వెదజల్లు సాగు చేశారు.

నెల రోజులు ఆలస్యం



ముందు చూపుతో ప్రభుత్వం కాలువల ద్వారా ముందుగా సాగునీరు విడుదల చేసినా, వర్షాకాలంలో అసలు వర్షాలు కురవలేదు. దీంతో వరి నాట్లు బాగా ఆలస్యమయ్యాయి. గతంలో జిల్లాలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు. ఈ ఏడాది లోటు వర్షపాతం కారణంగా వరి నాట్లు నెల రోజులు ఆలస్యమయ్యాయి.

– ఎన్.విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, కాకినాడ

క్లుప్తంగా

బాలకృష్ణ అభిమానుల ర్యాలీకి అనుమతి లేదు

కంబాలచెరువు: నందమూరి బాలకృష్ణ అభిమానులు, టీడీపీ కార్యకర్తలు చలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు పిలుపులో భాగంగా నిర్వహించే ధర్నాలు, రాస్తారోకోలకు జిల్లా పరిధిలో ఎటువంటి అనుమతులు లేవని ఎస్పీ జగదీష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. పోలీసు నిబంధనలను బేఖాతారు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని సామాజిక మాధ్యమాలలో ఈ నెల 5న ఆల్ ఇండియా బాలకృష్ణ అభిమానులు, టీడీపీ కార్యకర్తలు చలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించనున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. సెక్షన్ 144, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉన్నందున జిల్లా పరిధిలో ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలకు అనుమతులు లేవన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురి అరెస్టు

రంగంపేట: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్టు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద వాహనాల తనిఖీలో భాగంగా రంగంపేట చంద్రేడుకి చెందిన నొక్కు నానిబాబు, రాజమహేంద్రవరానికి చెందిన గుమ్మడి ప్రసాద్, రాజానగరం మండలం తోకాడకి చెందిన తోరాటి సురేష్ మద్యం తాగి వాహనాలు నడుతుండటంతో ముగ్గురిపై కేసు నమోదు చేసి పెద్దాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ బుల్లెమ్మ ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున అపరాధ రుసుం విధించినట్టు తెలిపారు.

కరాటే పోటీలకు నాగచందు



రాజోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో నిర్వహించిన జిల్లాస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన చింతలపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి మాదాసి నాగచందు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ మేరకు మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దొంగ జానకీరామయ్య ఆధ్వర్యంలో నాగచందును అభినందించారు.

తాగుబోతులపై కేసు

కాకినాడ క్రైం: ఆరుబయట తాగుతూ తూగుతున్న మందుబాబులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. మంగళవారం కాకినాడ టూ టౌన్ పీఎస్ పరిధిలో 20 మందిని అదుపులోకి తీసుకున్నారు. మద్యం దుకాణాల పరిధి దాటి బయటకి వచ్చి మద్యం తాగడంతో పాటు తాగుతూ సంచరించిన కారణాలతో వీరిని అదుపులోకి తీసుకున్నారు. మందుబాబులకు కౌన్సెలింగ్ ఇచ్చి కేసులు నమోదు చేయనున్నట్లు టూ టౌన్ సీఐ నాగేశ్వర్‌నాయక్ తెలిపారు.

పరిశుభ్రతే లక్ష్యంగా 'స్వేచ్ఛ'

- పాఠశాలల్లో డ్రాపవుట్స్‌ను తగ్గిస్తున్న పథకం
- విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్స్



విద్యార్థులకు సరఫరా చేస్తున్న న్యాప్‌కిన్స్



కౌమార బాలికలకు అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసులు

రాయవరం: ప్రభుత్వం పాఠశాల విద్యకే కాదు..విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రాధాన్యమిస్తోంది. అంతేకాదు బాలికల ఆరోగ్య పరిరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో బాలికల డ్రాపవుట్స్ తగ్గించేందుకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్స్ రెండవ విడత పంపిణీకి విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పాఠశాలల్లో కిశోర బాలికల ఆరోగ్యం, పరిశుభ్రతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం 'స్వేచ్ఛ' పథకాన్ని అమలు చేస్తోంది. బాలికలు రుతుక్రమ సమయంలో ఇబ్బందులు ఎదుర్కోవడం పాఠశాలల్లో డ్రాపవుట్స్‌కు కారణమవుతోంది. దీన్ని నివారించేందుకు ఈ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే కిశోర బాలికలకు ఉచిత శానిటరీ న్యాప్‌కిన్స్ పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతేడాది అక్టోబర్ 5న ప్రారంభించారు.

303 పాఠశాలల్లో..

కోనసీమ జిల్లాలోని 22 మండలాల పరిధిలో 309 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల పరిధిలో 7 నుంచి 10వ తరగతి వరకు 31,808 మంది బాలికలు విద్యాభ్యాసం చేస్తున్నారు. జిల్లాలో 14 ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థినులకు ఈ పథకంలో భాగంగా న్యాప్‌కిన్స్ అందించనున్నారు. ఇప్పటికే మండలాల వారీగా ఆయా విద్యా సంస్థలకు బ్రాండెడ్ న్యాప్‌కిన్స్‌ను సరఫరా చేశారు. ఈ పథకం ద్వారా కిశోర బాలికల హాజరు శాతం గణనీయంగా పెరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

విద్యాశాఖ ఆధ్వర్యంలో..

కౌమార దశలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు న్యాప్‌కిన్స్ పంపిణీ చేస్తున్నారు. గతంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేయగా, ఈ ఏడాది పాఠశాల విద్యాశాఖలోని మధ్యాహ్న భోజన పథకం విభాగానికి ఈ బాధ్యతను అప్పగించారు. దీంతో ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ న్యాప్‌కిన్స్ నాణ్యతను పరిశీలించి ఏ పాఠశాలకు ఎన్ని అవసరమో గుర్తించి, పాఠశాలలకు సరఫరా చేసేలా చూస్తుంది. అక్కడ సైన్స్ టీచర్ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తారు. రుతుక్రమంలో ఎదురయ్యే సమస్యలు, నివారణ చర్యలపై విద్యార్థినుల్లో అవగాహన కల్పించడానికి మహిళా ఉపాధ్యాయులు, మహిళా పోలీసుల ద్వారా పాఠశాలల్లో అవగాహనా సదస్సులు కూడా నిర్వహిస్తున్నారు. ప్రతి పాఠశాలలో ఈ కార్యక్రమం అమలుకు మహిళా ఉపాధ్యాయురాలిని నోడల్ టీచర్‌గా ఎంపిక చేశారు. వీరు విద్యార్థులకు న్యాప్‌కిన్స్ వినియోగంపై అవగాహన కల్పిస్తారు. గ్రామీణ ప్రాంతంలో చాలామంది బాలికలకు న్యాప్‌కిన్స్‌పై అంతగా అవగాహన ఉండడం లేదనే భావన ఉంది. ప్రభుత్వం చేపట్టిన స్వేచ్ఛ కార్యక్రమం ద్వారా కిశోర బాలికల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై పూర్తిస్థాయి అవగాహన పెరుగుతుందనే భావనను పలువురు మహిళా టీచర్లు వ్యక్తం చేస్తున్నారు.

కట్టుబాటు నుంచి స్వేచ్ఛలోకి..

రాష్ట్రంలోని మహిళలు, బాలికలు 'కట్టుబాటు నుంచి స్వేచ్ఛ'లోకి నినాదంతో అమలవుతున్న కార్యక్రమంలో భాగంగా వారి పరిశుభ్రత, ఆరోగ్యానికి భరోసా కల్పించేలా 'స్వేచ్ఛ' ద్వారా విద్యాసంస్థల్లో ఉచిత న్యాప్‌కిన్స్ పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి ప్రకటించిన ఈ పథకం పూర్తిస్థాయిలో అమలు చేసేలా ఐసీడీఎస్ అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రతి విద్యార్థినికి రెండు నెలలకోసారి 10 ప్యాకెట్లు (60 న్యాప్‌కిన్స్) వంతున ఏడాదికి 60 ప్యాకెట్లు అందిస్తారు.

బాల్ బాడ్మింటన్‌లో మధులత ప్రతిభ



మధులతను అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

రాయవరం: మండలంలోని చెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దాసరి మధులత బాల్ బాడ్మింటన్‌లో రాష్ట్ర స్థాయిలో ఆడనున్న జిల్లా జట్టుకు ఎంపికైంది. ఈ విషయాన్ని పాఠశాల హెచ్‌ఎం జి.రాజ్యలక్ష్మి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్)లో భాగంగా మండల స్థాయి, మండపేట నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీల్లో బాల్ బాడ్మింటన్ విభాగంలో మధులత ప్రతిభ కనబర్చింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో అనపర్తిలో జరిగిన పోటీల్లో విజేతగా నిలిచి, రాష్ట్ర స్థాయిలో ఆడే జిల్లా జట్టుకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మధులతను పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు మేకా సత్యనారాయణ, పీఈటీ ఆర్.దుర్గాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నిడదవోలు రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ మంగళవారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం సమిశ్రగూడెం లోహియనగర్‌కు చెందిన మన్యం వెంకటేశ్వర్లు (65) గత నెల 29వ తేదీన నిడదవోలు నుంచి ఇంటికి బైక్‌పై వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్వర్లు తలకు తీవ్రగాయాలు కావడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యసేవలందిస్తుండగా మంగళవారం రాత్రి మృతిచెందినట్లు కుమారుడు మన్యం శ్రీను ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుభానీ పేర్కొన్నారు.

కంటైనర్‌లో తరలిస్తున్న 31 ఆవులు స్వాధీనం

జగ్గంపేట: జాతీయ రహదారిపై జగ్గంపేటలో మంగళవారం ఎస్సై నాగార్జునరాజు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఒడిశా నుంచి కేరళకు ఒక కంటైనర్‌లో తరలిస్తున్న 31ఆవులను పట్టుకున్నారు. బాధ్యులైన నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ ఆవులను గోకవరం మండలం కృష్ణుడుపాలెంలోని గోశాలకు తరలించినట్లు తెలిపారు. ఈ సంఘటనలో కర్ణాటకకు చెందిన ఇద్దరిని, నిడదవోలుకు చెందిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు వివరించారు.

'నన్నయ'లో ఆక్వా కల్చర్‌పై పరిశోధనలు



సమీక్షలో వీసీ ఆచార్య పద్మరాజు, షిప్ వెల్ఫేర్ ఇనిషియేటివ్ ప్రతినిధులు, అధ్యాపకులు

రాజానగరం: గోదావరి జిల్లాలకు చెందిన విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించే దిశగా వివిధ రకాల కోర్సులతో విద్యాబోధనను అందిస్తున్న ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆక్వాకల్చర్ పై చేపట్టే పరిశోధనలను ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా మానవాళికి, పర్యావరణానికి మేలు చేకూర్చేలా ఇండియన్ మేజర్ కార్ప్ చేపల పెంపకంపై పరిశోధనకు షిప్ వెల్ఫేర్ ఇనిషియేటివ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. చేపల చెరువుల నిర్మాణం, బోర్ వెల్, పరిశోధనలకు అవసరమైన నిధులను ఇనిషియేటివ్ సమకూర్చనుంది. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు పరిశోధన సంబంధమైన విషయాలు సులువుగా అవగాహన చేసుకునే సదుపాయాలతోపాటు విజ్ఞానాన్ని షిప్ వెల్ఫేర్ ఇనిషియేటివ్ పరిశోధన నిపుణులతో పంచుకోవచ్చు. విద్యార్థులు పరిశోధనలు చేసి, ప్రచురించిన పత్రాలకు కూడా నిధులు మంజూరు చేస్తారు. ఎంఎస్సీ ఆక్వాకల్చర్ కోర్సు పూర్తి చేసిన తరువాత ప్లేస్‌మెంట్స్ కూడా పొందవచ్చు.

పరిశోధనల ప్రగతిపై సమీక్ష

షిప్ వెల్ఫేర్ ఇనిషియేటివ్‌తో 'నన్నయ' వర్సిటీకి కుదిరిన అవగాహన ఒప్పందంలో భాగంగా యూనివర్సిటీ ఈసీ హాలులో పరిశోధనల ప్రగతిపై వీసీ ఆచార్య కె.పద్మరాజు ఆధ్వర్యంలో మంగళవారం సమీక్ష జరిగింది. సుస్థిర అభివృద్ధిలో చేపల పెంపకాన్ని ప్రోత్సహించే దిశగా చేపట్టిన పరిశోధనలకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని, కావలసిన సదుపాయాలను సమకూర్చాలని అన్నారు. ఎమ్మెస్సీ ఆక్వాకల్చర్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించాలన్నారు. చేపలను మానవాళి మాదిరిగానే పరిగణించి పెంచాలని, ఇలా సహజ సిద్ధంగా పెంచడం వల్ల ఎటువంటి సమస్యలు ఉండవని యానిమల్ ఆస్క్ కో ఫౌండర్ జార్జ్ బ్రిడ్జ్వాటర్ పేర్కొన్నారు. రీసెర్చ్ అండ్ డవలప్‌మెంట్ డీన్ డాక్టర్ కె.రమణేశ్వరి అధ్యక్షతన ఈ సమీక్ష జరిగింది. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, షిప్ వెల్ఫేర్ ఇనిషియేటివ్ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఫిట్ ఇండియా' క్విజ్‌కు సిద్ధంకండి

- ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు అర్హులు
- దరఖాస్తుకు రేపే తుది గడువు



ఫిట్ ఇండియా క్విజ్ లోగో

రాయవరం: విద్యార్థులను ప్రోత్సహించేందుకు 2019లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఫిట్ ఇండియా మిషన్‌ను ప్రారంభించారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఈ పోటీలను నిర్వహిస్తున్నాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) 'ఫిట్ ఇండియా' క్విజ్–2023 పోటీలను నిర్వహిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. పాల్గొనేందుకు ఈ నెల ఐదవ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా హెచ్‌టీటీపీఎస్://ఫిట్‌ఇండియా.ఎన్‌టీఏ.ఏసీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలి. రూ.100 పరీక్ష ఫీజు ఐదవ తేదీ రాత్రి 11.50 గంటలలోగా క్రెడిట్/డెబిట్ కార్డు లేదా యూపీఐ ద్వారా చెల్లించవచ్చు. దరఖాస్తులో మార్పులు, చేర్పులను ఈ నెల ఏడు నుంచి 11వ తేదీ లోపు చేసుకోవచ్చు. 1–12 తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొనవచ్చు.

పరీక్షా విధానమిదీ..

విద్యార్థులు తమ పాఠశాల నుంచే ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌లో పరీక్ష రాయవచ్చు. ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ప్రిలిమినరీ నవంబర్ ఒకటి నుంచి 8వ తేదీ వరకు ఉంటుంది. రాష్ట్ర స్థాయి పరీక్ష డిసెంబర్ ఒకటి నుంచి 25వ తేదీ వరకు ఉంటుంది. జాతీయ స్థాయి పరీక్ష జనవరిలో ఉంటుంది.

బహుమతులు ఇలా..

జాతీయ, రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మొత్తం రూ.3.25కోట్ల విలువైన బహుమతులు అందజేస్తారు. రాష్ట్ర స్థాయిలో క్వాలిఫై అయిన వారికి రూ.రెండు వేల వంతున అందజేస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం పొందిన 10 మందికి రూ.25వేలు వంతున, మొదటి రన్నరప్‌గా నిలిచిన వారికి రూ.10వేల వంతున, రెండవ రన్నరప్‌గా నిలిచిన 10 మందికి రూ.5వేలు వంతున అందజేస్తారు. జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన 10 మందికి రూ.2.5 లక్షల వంతున, మొదటి రన్నరప్‌గా నిలిచిన 10 మందికి రూ.1.5 లక్షల వంతున, రెండవ రన్నరప్‌గా నిలిచిన 10 మందికి రూ.లక్ష వంతున అందజేస్తారు. విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లు ఇస్తారు.

నిందితుడి అరెస్టు



నిందితుడిని అదుపులోకి తీసుకుంటున్న రైల్వే పోలీసులు

తుని: రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడిని అరెస్టు చేసినట్లు స్థానిక జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ మంగళవారం తెలిపారు. వివరాల్లోకెళితే..రైలుబండిలో దొంగతనాలకు పాల్పడుతున్న అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పి.లక్ష్మీపురానికి చెందిన పడాల అనంతలక్ష్మినారాయణ(23)ను ఎస్సై మారూఫ్ అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి నాలుగు తులాల బంగారం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విజయవాడ రైల్వే మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చనున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు

రంగంపేట: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన చెప్పిన వివరాల ప్రకారం రంగంపేట మండలం వడిశలేరు గ్రామానికి చెందిన బాలిక గత నెల 29వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు ఎస్ఐ తెలిపారు.

ముగిసిన సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ ఎంపికలు



బాలుర విభాగంలో ఎంపికైన క్రీడాకారులు, ఎంపిక చేసిన అధికారులు, నాయకులు

కాజులూరు: రాష్ట్ర స్థాయి సీనియర్, పురుషులు, మహిళల సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనేందుకు కాజులూరు మండలం గొల్లపాలెంలో రెండు రోజులుగా జరుగుతున్న జిల్లా జట్ల ఎంపిక విజయవంతంగా ముగిసినట్టు స్థానిక జెడ్పీ హైస్కూల్ పీడి జి.సునీల్‌కుమార్ తెలిపారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకూ నంద్యాల జిల్లా ఆళ్ళగడ్డలో 10వ అంతర్ జిల్లాల సీనియర్, పురుషులు, మహిళల సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల స్థాయిలో జిల్లా జట్టును ఎంపిక చేసేందుకు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జె.హరికృష్ణ, ఆడ్డగళ్ళ నాగరాంప్రసాద్, సెలెక్షన్ కమిటీ కన్వీనర్ కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో అధికారులు సెలెక్షన్‌ను నిర్వహించగా ఐ.పోలవరం, తాళ్లరేవు, జి.వేమవరం, గొల్లపాలెం, పెద్దాపురపాడు, రావులపాలెం, అమలాపురం, అనపర్తి, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి పలువురు క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో బాలుర విభాగానికి 16 మంది క్రీడాకారులను, బాలికల విభాగానికి 16 మందిని ఎంపిక చేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు పి.గోవిందరాజు, బి.సతీష్, జి.సూర్యప్రకాశ్, తనోజ్, చిట్టి పాల్గొన్నారు.



బాలికా విభాగంలో ఎంపికైన క్రీడాకారులు, ఎంపిక చేసిన అధికారులు, నాయకులు

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



కోరంగి ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో జరిగిన వన్యప్రాణి వారోత్సవాల్లో అటవీ శాఖ సిబ్బంది, విద్యార్థులు

తాళ్లరేవు: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతని కాకినాడ జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.భరణి అన్నారు. మంగళవారం కోరంగి ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన వన్యప్రాణి వారోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు వన్యప్రాణులు ఎంతగానో ఉపయోగపడతాయని, వాటి ప్రాముఖ్యతను తెలియజేయడంతో పాటు వాటి సంరక్షణకు చేపట్టాల్సిన అంశాలను వివరించేందుకు ప్రభుత్వం ఏటా వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తుందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అటవీశాఖ అధికారి జి.నరేంద్రన్ విద్యార్థులకు యూపీఎస్సీ పరీక్షల్లో ఉపయోగపడే అంశాలను వివరించారు. ఐబీసీఎస్ స్టేట్ కోఆర్డినేటర్ మృత్యుంజయ రావు పక్షులను గుర్తించడమెలాగో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాకినాడ అన్నవరం సత్యదేవా డిగ్రీ మహిళా కళాశాల ఉపాధ్యాయులు వసంత లక్ష్మి, ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, రీసెర్చ్ సైంటిస్ట్ మహేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యంతో 'ఉపాధి'

- పంచాయతీరాజ్ రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్
- 11 జిల్లాల డ్వామా అధికారులకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న కృష్ణమోహన్

సామర్లకోట: ఉపాధి హామీ పథకంలో పనులు మరింత నాణ్యంగా జరగడానికి డ్వామా అధికారులు శిక్షణ ఇస్తున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమ, ఏలూరు, కాకినాడ, కోనసీమ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలో పని చేస్తున్న డ్వామా ఏపీడీ, ఏపీఓలకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణను మంగళవారం ప్రారంభించారు. ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలో మొక్కలు నాటడంపై దృష్టి సారించాలన్నారు. 60 శాతం మునగ మొక్కలు ఉండేలా చూడాలన్నారు. ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ శిక్షణ ప్రారంభిస్తూ డ్వామా అధికారులు గ్రామాల్లో పెంచుతున్న మొక్కలపై సమాచారం సేకరించారు. మొబైల్ యాప్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన పెరిగేలా శిక్షణ ఉంటుందన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే పనుల గుర్తింపు, అంచనాల తయారు, మొక్కలు నాటడం, పుస్తకాల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈటీసీ ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, బి.ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, వి.ప్రసాద్, నిహారిక, ఎస్‌కే మోహిద్దీన్ మొదటి రోజు శిక్షణ నిర్వహించారు.

అండర్–19 స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక

పిఠాపురం: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అండర్–19 స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక మంగళవారం నిర్వహించారు. ఆర్చరీ (విలువిద్య), రగ్బీ, త్రోబాల్‌లో జరిగిన ఈ ఎంపికల్లో సుమారు 200 మంది పాల్గొన్నారని ప్రిన్సిపాల్ వి.కేశవరావు తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన వారు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ అడ్వైజర్లు వై.తాతబ్బాయి, మహమ్మద్ హుస్సేన్, అధ్యక్షులు నాగేంద్ర కుమార్, బి.వంశీ, ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి పి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.